సాక్షి సిద్దిపేట
ఆదివారం । 11 । మే । 2025

బిడ్డ కోసం బతుకుపోరాటం



సిద్దిపేటజోన్: విధి వక్రించి ఇంటి పెద్ద దూరం అయ్యాడు. దిక్కుతోచని స్థితిలో ఇంటి బాధ్యతలు భరిస్తూనే.. కన్న కూతురుకు తండ్రి లేడనే కొరత లేకుండా అన్నీ తానై అమ్మకు ప్రతీకగా నిలిచింది విజయ. సిద్దిపేటకు చెందిన విజయ వివాహం జరిగిన పదేళ్లకే భర్తను కోల్పోయింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్నా కూతురు సాత్విక.. ఆలనా పాలన విషయంలో ఏ మాత్రం తేడా లేకుండా కష్టపడి పోషిస్తోంది. రెక్కల కష్టంపై ఆధారపడి ఇంటిని ముందుకు నడిపిస్తోంది. ఒక్కగానొక్క కూతుర్ని బాగా చదివించి ప్రయోజకురాలిని చేయాలనే ఏకైక లక్ష్యంగా విజయ జీవితంతో పోరాటం చేస్తోంది. చిన్న చిన్న పనులు చేస్తూ వచ్చిన కొద్దిపాటి డబ్బులతో కూతురును పోషిస్తూ ఉన్నత ప్రయోజకురాలిగా తీర్చిదిద్దుతోంది.

కనిపించే దైవం.. అమ్మ



అమ్మ.. కనిపించే దైవం. ప్రేమ, త్యాగం, భరోసా, ఓర్పు, సహనం, ధైర్యం.. వీటిన్నింటికీ మారుపేరు అమ్మే. ప్రపంచంలో వెలకట్టలేనిది తల్లి ప్రేమే. పొత్తిళ్లలో బిడ్డను చూడగానే ప్రసవ వేదనను మర్చిపోతుంది. నవమాసాలు మోసి, కన్న బిడ్డల్ని కంటికి రెప్పలా చూసుకుంటుంది. బిడ్డల ఎదుగుదలనే తన ఎదుగుదల అనుకుంటుంది. పిల్లల మనసును అర్థం చేసుకుని అడగకుండానే అన్నీ ఇస్తుంది. ఎంత కష్టమొచ్చినా భూదేవిలా తనలో దాచుకుంటుందే తప్ప, ఎవరినీ నిందించదు. ఎప్పుడూ మంచే జరగాలని కోరుకునే అమ్మ మనసు అమృతం కన్నా గొప్పది.

ఇంతటి ఔన్నత్యాన్ని చాటుతున్న అమ్మలపై నేడు మదర్స్ డే సందర్భంగా కొన్ని ప్రత్యేక కథనాలు..

కంటికి రెప్పలా కాపాడుతూ..



పరశురాములుకు అన్నం తినిపిస్తున్న తల్లి బుచ్చవ్వ

నంగునూరు(సిద్దిపేట): 'తొలిసూరు కొడుకు పుట్టాడని సంతోషపడ్డా.. కాని మాటలు రాకపాయే.. కాళ్లు, చేతులు పని చేయక 30 ఏళ్ల నుంచి గోస పడుతుండు బిడ్డ..' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది నంగునూరుకు చెందిన కాసర్ల బుచ్చవ్వ. పండుగలు, పబ్బాలను పక్కన పెట్టి ఇంటి పట్టునే ఉంటూ కొడుకుకు సపర్యలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుతోంది మాతృమూర్తి. సిద్దిపేట జిల్లా నంగునూరుకు చెందిన కాసర్ల మల్లయ్య, బుచ్చవ్వ దంపతులకు కుమారుడు పర్శరాములు (31), ఇద్దరు కూతుళ్లు. నిరుపేదలైన వీరు కూలి పనులు చేస్తూ ఇద్దరు బిడ్డల పెళ్లి చేశారు. పుట్టుకతో మూగ, చెవిటి వాడైన పరశురాములు కాళ్లు, చేతులు చచ్చుబడి ఎటూ కదలలేని స్థితిలో బతుకీడుస్తున్నాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. కొడుకు దీనావస్థను చూసి కుంగిపోని తల్లి బుచ్చవ్వ పరశురాములు రోజు సపర్యలు చేస్తూ, పళ్లు తోమడం, అన్నం తినిపించి, స్నానం చేయిస్తూ చిన్న పిల్లాడిలా సాకుతోంది. రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలో కుటుంబ పరిస్థితులు ఉన్నా బిడ్డ కోసం అన్ని వదులుకొని కుటుంబాన్ని నెట్టుకొస్తోంది మాతృమూర్తి.

40 ఏళ్లుగా అన్నీ తానై..

దివ్యాంగులైన కుమారులకు మాతృమూర్తి సేవలు



కుమారుడికి స్నానం చేయిస్తున్న తల్లి

పటాన్‌చెరు టౌన్: దివ్యాంగులైన ఇద్దరు కుమారులను 40 ఏళ్లుగా కంటికి రెప్పలా చూసుకుంటోంది ఓ మాతృమూర్తి. లేచింది మొదలు వారి సేవలోనే జీవితం గడుపుతోంది. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివాలయం రోడ్డులో వృద్ధురాలైన చంద్రకళ నివిస్తోంది. భర్త మడపతి చంద్రయ్య 2009 లో మృతి చెందాడు. నలుగురు కుమారులు. ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఒక కొడుకు రాజశేఖర్, కూతురు భాగ్యలక్ష్మి బాగానే ఉన్నారు. మిగతా నలుగురిలో కూతురు ఉమరాణి పుట్టుకతోనే మూగ. మిగతా ముగ్గురు కుమారులు సిద్ధప్ప, మహేశ్వర్, రవికుమార్‌లకు చిన్నప్పుడే కాళ్లు, చేతులు పడిపోయాయి. మాటలు రాని ఉషారాణి సైతం ప్రస్తుతం తల్లి మీదే ఆధారపడింది. మూడేళ్ల క్రితం రెండో కుమారుడైన మహేశ్వర్ మృతి చెందాడు. ఉన్న ఇద్దరు కుమారులకు, కూతురుకు ఉదయం లేచిన మొదలు.. రాత్రి పడుకునే వరకు సేవలు చేస్తూ కాలం గడుపుతోంది వృద్ధురాలు.

పెన్షనే ఆధారం..

అయితే వీరి జీవనాధారం.. తల్లి తోపాటు ఇద్దరు కుమారులకు వచ్చే పెన్షన్ మొత్తం రూ.10 వేల తోనే నెల మొత్తం గడపాల్సి వస్తోంది. అప్పుడప్పుడు దాతలు వచ్చి నిత్యావసర సరుకులు ఇచ్చి వెళ్తారని ఆ తల్లి తెలిపారు. తమ తల్లి 40 ఏళ్లకు పైగా తమను చూసుకుంటుందని, చిన్నపిల్లలను చూసుకునే విధంగా రోజూ స్నానం చేయించి, భోజనం తినిపించి ప్రేమగా చూసుకునే తల్లి దొరకడం అదృష్టంగా భావిస్తున్నామని కుమారులు సిద్దప్ప, రవికుమారులు అంటున్నారు.



దివ్యాంగులైన కుమారులకు తినిపిస్తున్న తల్లి చంద్రకళ

పేదరికం నుంచి.. ఉన్నతస్థాయికి చేర్చి



అమ్మ లక్ష్మితో నవీన్ గౌడ్

దుబ్బాకటౌన్: ఓ తల్లి కృషి.. పేదరికం నుంచి మొదలైన అడుగు ఉన్నత స్థానాలను చేర్చింది. దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన యాడారం లక్ష్మి.. వివాహమైన కొన్నేళ్లకే అనారోగ్య కారణాలతో భర్తను కోల్పోయింది. తాను బీడీలు చుడుతూనే కొడుకు నవీన్ గౌడ్‌ను బాగా చదివించింది. అమ్మ కష్టాన్ని తెలుసుకున్న నవీన్ గౌడ్ సైతం కష్టపడి చదివాడు. 2009లో పదో తరగతి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. ఇంటర్ పూర్తయ్యాక.. బీటెక్ చేస్తున్న సమయంలోనే ప్రభుత్వ ఉద్యోగం కోసం పుస్తకాలతో కుస్తీ పట్టాడు. 2018లో పంచాయతీ కార్యదర్శిగా, గ్రూప్ –4 ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. 2020లో హాస్టల్ వార్డెన్‌గా ఎంపికై విధులు నిర్వహిస్తున్నాడు.

గ్రూప్– 2 లో స్టేట్ 166 ర్యాంక్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 2 ఫలితాల్లో నవీన్‌గౌడ్ స్టేట్ 166 ర్యాంక్ సాధించి ప్రతిభ కనబర్చారు. చిన్నప్పటి నుంచి కిరాయి ఇంట్లోనే ఉంటున్న నవీన్ గౌడ్ ఇటీవల తన సొంతింటి కళను సైతం నిజం చేసుకుని అమ్మ కోరికను తీర్చారు. కాగా గ్రూప్–2లో మంచి పోస్టింగ్ వస్తుందని నవీన్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

కూలి పనులు చేస్తూ పిల్లల ఉన్నతికి శ్రమిస్తూ

చిన్నకోదూరు(సిద్దిపేట): పిల్లల బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తోంది ఆ తల్లి. తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ, మరోవైపు కూలీ పనులకు వెళ్తూ తన పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతోంది. సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన గోవిందారం రజితకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భర్త శ్రీహరి పిల్లలు చిన్న వయస్సులో ఉన్నప్పుడే మృతి చెందాడు. ఇంటి బాధ్యత అంతా తనపై వేసుకుని పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తోంది. పెద్ద కూతురు పూజిత(బీ ఫార్మసీ), రెండో కూతురు మౌనిక (డిగ్రీ ద్వితీయ), మూడో కూతురు వైష్ణవి(ఇంటర్ మొదటి), కుమారుడు సాత్విక్(6వ తరగతి) చదువుతున్నారు. వారికి ఎలాంటి లోటురాకుండా నిరంతరం శ్రమిస్తూ వారిని ఉన్నత చదువులు చదివించాలని సంకల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.



ముగ్గురు కూతుళ్లు, కుమారునితో తల్లి రజిత

బీడీలు చుడుతూ.. కష్టాలకు ఎదురీదుతూ..



దుబ్బాక: అమ్మా అనే పదానికి నిలువెత్తు నిదర్శనం దుబ్బాక పట్టణానికి చెందిన లావణ్య.. ముక్కు పచ్చలారని వయస్సులోనే పెళ్లి.. ఆపై ఇద్దరు ఆడపిల్లలు.. పెళ్లయిన ఐదేళ్లకే చేనేత కార్మికుడైన భర్త అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త అంత్యక్రియలు సైతం స్థానికులు చందాలు వేసుకుని జరిపించారు. ఈ పరిస్థితుల్లో పిల్లలు, వృద్ధులైన అత్తామామలు భారంగా భావించకుండా రెక్కల కష్టంతో పోషిస్తోంది. ఓ చిన్న కిరాయి ఇంట్లో ఉంటున్న లావణ్య దీనస్థితిని చూసి ఏడాదిన్నర క్రితం డబుల్ బెడ్రూం ఇచ్చారు. 2011లో అంగన్ వాడి ఆయాగా నియమించారు. ఆయాగా పనిచేస్తూ బీడీలు చుడుతూ.. బట్టలు కుడుతూ నిరంతరం శ్రమిస్తోంది. 7వ తరగతి వరకే చదువుకున్న లావణ్య.. బిడ్డలను చదివించడమే కాకుండా తాను 10 వ తరగతి (ఓపెన్ టెన్త్) పాసయింది. ప్రస్తుతం పెద్దకుమార్తె ఆకాంక్ష బీఎస్సీ నర్సింగ్ చదువుతుండగా, చిన్నకుమార్తె కావ్య ఇప్పుడు ఇంటర్ పూర్తి అయి ఎంసెట్ రాశారు. కష్టాలకు ఎదురీదుతూ కూతుళ్లను మంచి చదువులు చదివిస్తున్న ఈ మాతృమూర్తి ఆదర్శంగా నిలుస్తున్నారు.

32 ఏళ్లుగా సేవలు..



ఝరాసంగం(జహీరాబాద్): ఓవైపు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం నిర్వహిస్తూ.. మరోవైపు కదలలేని స్థితిలో ఉన్న కుమారుడిని కంటికి రెప్పలా కాపాడుతోంది ఓ మాతృమూర్తి. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం కుప్పానగర్‌కు చెందిన ఈశ్వరమ్మ, రాములుకు 32 ఏళ్ల క్రితం మనోజ్ కుమార్ జన్మించాడు. పుట్టుకతోనే కదలలేని స్థితిలో ఉన్న కుమారుడికి బాగవుతుందని నమ్మకంతో పలు ఆస్పత్రులలో సంప్రదించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. పుట్టినప్పటి నుంచి నేటి వరకు కుమారుడికి అన్ని విధాలుగా సేవలు చేస్తూ కనుపాపలా చూసుకుంటోంది ఆ తల్లి. స్నానం చేయించడం, తినిపించడం, వంటి అన్నీ తానై సేవలు అందిస్తున్నారు. ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే కొడుకుకి ఏ లోటు లేకుండా చూసుకుంటున్నారు.

40 మంది చిన్నారులకు అమ్మలా..

బాలసదనంలోని అనాథల ఆలనాపాలన చూస్తున్న రమాదేవి



కొండపాక(గజ్వేల్): సిద్దిపేట జిల్లా కొండపాకలోని బాలసదనంలో 40 మంది అనాథ పిల్లలకు తల్లిలేని లోటును తీరుస్తున్నారు. అందరితో అమ్మగా పిలుపించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు బాలసదనం ఇన్‌చార్జి రమాదేవి. హైదరాబాద్ పట్టణానికి చెందిన రమాదేవి జవహర్ లాల్ బాలసదనంలో సూపరింటెండెంట్ ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. బాల సదనంలో పిల్లల పోషణ బాధ్యత విషయాల్లో ఎంతో నిక్కచ్చిగా వ్యవహరించారు. ఈక్రమంలోనే కొండపాకలోని ఆనంద నిలయం నిశాంత్ బాలసదనంలో ఏడేళ్లుగా 40 మంది అనాథ పిల్లలకు తల్లిలేని లోటును తీరుస్తూ వారిలో సంతోషాన్ని నింపుతున్నారు. సిద్దిపేట పట్టణానికి చెందిన రాజమౌళి మనవడు నిశాంత్ చిన్న తనంలో చనిపోవడంతో ఆయన జ్ఞాపకార్థం కొండపాకలో వారి కుటుంబసభ్యులు నిశాంత్ బాలసదనాన్ని నిర్మించారు. ఈ సదనంలో ఉన్న పిల్లలకు చదువు, ఆటలు, క్రమశిక్షణ, భగవద్గీత శ్లోకాలు, సమాజ సేవా దృక్పథాలు నేర్పిస్తూ ఆలనా పాలన చూస్తున్నారు. కుటుంబంతో హాయిగా గడుపాల్సిన రమాదేవి అన్నింటిని వదిలి అనాథ పిల్లలతోనే ఉంటూ సేవలు చేస్తున్నారు. పిల్లలందరూ అమ్మా.. అమ్మా.. అంటూ పిలుస్తుండటంతో ఆ పిలుపుల్లో ఉన్న మాధుర్యం, ఆనందాన్ని మాటల్లో చెప్పలేనంటూ రమాదేవి ఆనంద బాష్పాలు రాల్చారు. ప్రస్తుతం పిల్లలను వదిలి ఒక్క రోజు కూడా ఉండలేక పోతున్నానన్నారు.



బాలసదనంలో పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న రమాదేవి



అనాథ పిల్లలతో ఇన్‌చార్జి రమాదేవి

అమ్మా అనే పిలుపుతో..

పిల్లలందరూ అమ్మా.. అంటూ పిలుస్తుండటంతో ఆ మాధుర్యం, ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ప్రస్తుతం పిల్లలను వదిలి ఒక్క రోజు కూడా ఉండలేకపోతున్నా. నాకు ఏ చిన్న ఆరోగ్య సమస్య ఎదురైనా పిల్లలందరూ అమ్మా అంటూ చుట్టూ నిలువగా ఆ బాధనుంచి ఉపశమనం పొందుతున్నాను. అమ్మా అంటూ పిలిపించుకునే భాగ్యం దొరకడం అదృష్టం. ఈ అవకాశం దొరికేలా చేసిన అందరికీ రుణపడి ఉంటాను.

– రమాదేవి, బాలసదనం ఇన్‌చార్జి

మిషన్ కుట్టి.. బతుకుబండి చేపట్టి



చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన అవుసుల దుర్గమణి మిషన్ కుడుతూ తన పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భర్త నాగభూషణాచారి అనారోగ్యంతో మృతి చెందాడు. అ సమయంలో చిన్న కుమారుడు ఆరు నెలల పసికందు.. అయినప్పటికీ చెదిరిపోని ధైర్యంతో కుట్టుమిషన్ నడుపుతూ ముగ్గురు పిల్లలను పోషించింది. కుమార్తె వివాహం చేయగా, ఇద్దరు కుమారులు ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడ్డారు. చందంపేట జెడ్పీపాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చిన్న కుమారుడు వేణుగోపాల్ మాటల్లో.. 'ఆరు నెలల పసికందుగా ఉన్నప్పుడే మా నాన్న మరణించారు. అప్పటి నుంచి అన్ని అమ్మే.. కుట్టుమిషన్ నడుపుతు వచ్చిన ఆదాయంతో నాతోపాటు అన్న, అక్కను పోషిస్తూ ఉన్నత చదువులు చదివించారు. నేను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, అన్న ప్రవీణ్‌కుమార్ హైకోర్టులో సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నామంటే అమ్మ అందించిన ప్రేరణే. అందుకే అమ్మ అంటే ప్రాణం.

ఇళ్లల్లో పని చేసి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తల్లిదండ్రులు బాల్య వివాహం చేశారు. భర్త చనిపోవడంతో ఇళ్లలో పనిచేస్తూ కూతురిని ఉన్నత చదువులు చదివించి అందరికీ ఆదర్శంగా నిలిచింది జయలక్ష్మి. వనపర్తి జిల్లా వారసిపల్లికి చెందిన జయలక్ష్మికి వారి తల్లిదండ్రులు బాల్య వివాహం చేశారు. భర్త 13ఏళ్ల క్రితం మృతి చెందాడు. దాంతో కొల్లూర్ ప్రభుత్వ డబుల్ బెడ్రూంలలో నివసించే జయలక్ష్మి ఇళ్లల్లో పని చేస్తూ తన కూతురు నందినిను బీఈడీ చదివించింది. మంచి సంబంధం చూసి పెళ్లి చేసింది. ఈసందర్భంగా నందిని మాట్లాడుతూ తన తల్లి కష్టపడి తనను చదివించిందని తెలిపారు. తాను ప్రస్తుతం ఇంటర్నేషనల్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నట్లు వివరించారు. అమ్మనే తనకు ఆదర్శమని తెలిపారు.



తల్లి జయలక్ష్మితో నందిని

క్లుప్తంగా

నేడు రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్

- డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ గణేశ్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఐఎంఏ హాల్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి జనరల్ ఫిజిషియన్ వైద్యుల కాన్ఫరెన్స్ జరుగనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా సిద్దిపేట శాఖ జనరల్ సెక్రటరీ డాక్టర్ క్రాంతికుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ వెనిశెట్టి గణేశ్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జనరల్ ఫిజిషియన్ వైద్యులు పాల్గొంటారని తెలిపారు. చైర్ పర్సన్ డాక్టర్ పెంటాచారి అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో ఇటీవల వైద్య రంగంలో వచ్చిన మార్పులు, రీసెంట్ అప్‌డేట్స్, ఎమర్జెన్సీ మెడిసిన్ పైన చర్చించడం జరుగుతుందన్నారు. సిద్దిపేటలో ఏపీఐ మొట్టమొదటి సారిగా ఈ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ డా.ఎస్ గణేశ్, జాయింట్ సెక్రటరీ డా.ఫణీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



అధికారులకు సూచనలు చేస్తున్న జయదేవ్ ఆర్య

దౌల్తాబాద్ (దుబ్బాక): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి జయదేవ్ ఆర్య సూచించారు. శనివారం దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామంలో గల ఐకేపీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, సీసీ సునీత, వీఏఓ కవిత కమిటీ సభ్యులు గాయత్రీ, రైతులు పాల్గొన్నారు.

కలశ ప్రతిష్ట మహోత్సవం



పూజలు చేస్తున్న రేణుకాచౌదరి దంపతులు

ములుగు(గజ్వేల్): మండలంలోని పాత మామిడ్యాల మెట్టు చింత వద్ద రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి వ్యవసాయ క్షేత్రంలో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయ శిఖర కలశ ప్రతిష్ట మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో రేణుకాచౌదరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశాలకు అభిషేకాలు, పూజగర్త సంస్కారం, కుంబాభిషేకం, పూర్ణాహుతి మార్జనం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం చేశారు.

83 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి శనివారం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వాహనాల తనిఖీ నిర్వహించి 83 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 380 కేసులు నమోదు అయ్యాయన్నారు. వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యారంటీగా ఇవ్వాలి

- సీఎంఆర్ ఆలస్యం, అక్రమాలకు చెక్ పెట్టేందుకు బ్యాంక్ గ్యారంటీలు
- ముందుకొచ్చింది 93 మిల్లులు, ఇంకా ఇవ్వనివి 30
- కేటాయించే ధాన్యంకు 10 శాతం బ్యాంక్ గ్యారంటీ
- 3.5 లక్షల టన్నుల ధాన్యం సేకరణ దాటితే ఇబ్బందే
- ఇప్పటి వరకు 1.9 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు



ధాన్యం కొనుగోలు

సాక్షి, సిద్దిపేట : మిల్లర్లు సీఎంఆర్ ఆలస్యం.. అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం బ్యాంక్ గ్యారంటీని తప్పనిసరి చేశారు. జిల్లా వ్యాప్తంగా 123 రైస్ మిల్లులుండగా ఇప్పటి వరకు బ్యాంక్ గ్యారంటీ 93 మిల్లులు సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు అందించారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ.. అకాల వర్షాలతో కొనుగోళ్లు వేగంగా జరగడం లేదు. 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దాటితే ధాన్యం నిల్వ పెట్టేందుకు ఇబ్బందికర పరిస్థితులు రానున్నాయి.

10 శాతం బ్యాంక్ గ్యారంటీలు

నిర్దేశించిన సమయంలో సీఎంఆర్ ఇవ్వకపోవడం, ధాన్యం మాయం కావడం లాంటివి రాష్ట్ర వ్యాప్తంగా పలుమార్లు జరగడంతో మిల్లర్ల దగ్గర నుంచి బ్యాంక్ గ్యారంటీలు తీసుకోవాలని నిర్ణయించారు. గతంలో హుస్నాబాద్ ఏఆర్ఎం ఆగ్రో ఇండ్రస్టీస్ మిల్లులో రూ.27.76 కోట్ల విలువ చేసే 9,522 మెట్రిక్ టన్నుల ధాన్యంను అక్రమంగా మిల్లు యజమాని విక్రయించారని తేలింది. ఇలా జరిగినప్పుడు ధాన్యం రికవరీ కష్టంగా మారుతోంది. బకాయిల్లేని మిల్లర్లు కేటాయించిన ధాన్యంలో 10 శాతం, బకాయిపడి తీర్చని వారు 20 శాతం, బకాయి తీర్చి పెనాల్టీ కట్టని వారు 25 శాతం బ్యాంక్ గ్యారంటీ చెల్లించాలని నిర్ణయించారు.

వెనుకడుగు వేస్తున్న మిల్లుల యజమానులు

జిల్లాలో పలు రైస్ మిల్లులు బ్యాంక్ గ్యారంటీ అంటే వెనుకడుగు వేస్తున్నారు. ఆయా మిల్లులపై బ్యాంక్‌లకు నమ్మకం లేకనా..? బ్యాంక్ గ్యారంటీ ఎందుకు ఇవ్వాలనినా..? రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇవ్వడం లేదు. ఆయా మిల్లుల్లో ఇప్పటికే గత వానాకాలం, యాసంగికి సంబంధించిన ధాన్యం నిల్వలున్నాయి. బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వకపోవడంతో గతంలో కేటాయించిన ధాన్యం నిల్వలు ఉన్నాయా లేదా అని అధికారుల్లో ఆందోళన మొదలైంది. బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వని మిల్లులను తనిఖీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

3.5 లక్షల టన్నులు దాటితే ఇబ్బందే..

జిల్లా వ్యాప్తంగా 417 కొనుగోలు కేంద్రాల్లో 1.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేశారు. 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ దాటితే నిల్వ పెట్టేందుకు ఇబ్బందులు తప్పవు. నిల్వలకు స్థలం ఉన్నప్పటికీ మళ్లీ ఆయా మిల్లుల నుంచి బ్యాంక్ గ్యారంటీ తీసుకోవాలి. 3.5 లక్షల టన్నుల ధాన్యం దాటితే ఎలా అని అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టి ధాన్యం సేకరణ ఎక్కువైనా సైతం ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పై దృష్టి పెడితేనే రైతులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉండవు.

గోదాంలలో భద్రపరుస్తాం



మిల్లర్లు ఇచ్చిన బ్యాంక్ గ్యారంటీకి అనుగుణంగా 3.5 లక్ష టన్నుల ధాన్యంను కేటాయిస్తాం. మిగిలిన ధాన్యంను గోదాంలకు, ఇతర జిల్లాలకు పంపిస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ప్రవీణ్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్



మురళీ నాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే హరీశ్ రావు

అమర జవాన్‌కు ఘన నివాళి

సిద్దిపేట జోన్ : భారత్–పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ చిత్ర పటానికి శనివారం జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాళులర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్లకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని పేర్కొన్నారు. జవాన్ మురళీ నాయక్ త్యాగం వృథా కాదని, మన దేశం కచ్చితంగా గొప్ప విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండి, జవాన్ల కుటుంబాలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజనర్స్, వేణుగోపాల్ రెడ్డి, సంపత్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

108 హోమ కుండాలతో హనుమాన్ హోమం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శనివారం 108 హోమ కుండాలతో సామూహిక నవగ్రహ హనుమాన్ హోమం, ఏకాదశ హనుమాన్ మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి, ఎమ్మెల్యే హరీశ్‌రావులు హాజరయ్యారు. శనివారం ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం విశ్వశాంత్యర్థం, 160వ అష్టోత్తర శతకుండాత్మక, 108 కుండాలతో హవనం, పూర్ణాహుతి, హనుమాన్ మాలధారణ స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. దుర్గా ప్రసాద్ స్వామి చేతుల మీదుగా ఏ కార్యక్రమం నిర్వహించిన విజయవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాంకాల నవీన్ కుమార్, రామకృష్ణ, వీరేశం, కైలాసం, హరి, పరమేశ్వర్, విశ్వనాథశర్మ, కాశీనాథ్, రమేశ్, రాము, సంతోష్ కుమార్, సత్యం పాల్గొన్నారు. అలాగే, జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి హనుమాన్ ఆలయంలో హనుమాన్ స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు.

ఫ్యాక్టరీని అందుబాటులోకి తేవాలి

నంగునూరు(సిద్దిపేట): రిఫైనరీ పనులను త్వరగా పూర్తి చేసి జూలై నాటికి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులకు సూచించారు. నర్మేటలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ పనులను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. పూర్తి స్థాయిలో పనులు కాకపోవడంతో ఆయిల్‌ఫెడ్ కమిషనర్‌కు ఫోన్ చేసి యుద్ధ ప్రతిపాదికన రిఫైనరీ పనులను చేపట్టాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు చేయగా మంచి దిగుబడి వస్తోందన్నారు. కొత్త పంట అయినప్పటికీ రైతులు ముందుకు రావడంతో వారి మేలు కోసం ఫ్యాక్టరీని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, సారయ్య, రమేశ్ గౌడ్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవం వైభవంగా చేద్దాం

– కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: చారిత్రాత్మక వేంకటేశ్వర దేవాలయం 50 ఏళ్ల ఉత్సవాలను వైభోవోపేతంగా నిర్వహించాలని, సిద్దిపేట ఆధ్యాత్మికత కీర్తి ఉట్టిపడేలా స్వర్ణోత్సవ ఉత్సవాలు నిర్వహిద్దామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో 17 నుంచి 22 వరకు జరగనున్న ఉత్సవాల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ దాతలు, సిద్దిపేట ప్రముఖులతో క్యాంపు కార్యాలయంలో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిన జీయర్ స్వామీజీ పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగనున్నాయని పేర్కొన్నారు. 50 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయానికి పెద జీయర్ స్వామి నుంచి చిన జీయర్ స్వామి వరకు, కేసీఆర్ నుంచి నా వరకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు ఈ దైవ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాల్సిన పిలుపునిచ్చారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ మిలింద్ కాంబ్లీ



మాట్లాడుతున్న మిలింద్ కాంబ్లీ

సిద్దిపేటకమాన్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి మిలింద్ కాంబ్లీ అన్నారు. సిద్దిపేట జిల్లా జైలును శనివారం పరిశీలించారు. జైలులోని వంట గది, టాయిలెట్స్‌ను తనిఖీ చేశారు. భోజన వసతుల గురించి జైలు సూపరింటెండెంట్ వికాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఖైదీల అందరికీ అడ్వకేట్స్ ఉండాలన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వారానికి మూడు సార్లు జైలును సందర్శిస్తారని, అడ్వకేట్స్ లేని వారికి లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వికాస్, బాలయ్య, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

బాల సదనం సందర్శన

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని బాల సదనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ సాయిరమాదేవి ఆదేశాల మేరకు శనివారం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ ఇన్‌చార్జి సెక్రటరీ మిలింద్ కాంబ్లీ సందర్శించారు. బాల సదనం పిల్లల ఆరోగ్యం, యోగ క్షేమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాల సదనం సిబ్బంది రిజిష్టర్ పరిశీలించారు. భోజనం నాణ్యత, వంటగది. పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో బాల సదనం సూపరింటెండెంట్ మమత, న్యాయవాది నాగపూజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య

దుబ్బాకరూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరీశ్ కథనం మేరకు.. గంగాల పరుశరాములు(40) ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై అప్పులు చేశాడు. తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. శుక్రవారం సాయంత్రం భార్యతో గొడవపడి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మత్తు పదార్థాలపై నిఘా

– టూటౌన్ సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై నిఘా ముమ్మరం చేసినట్లు టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో నార్కోటిక్ డాగ్స్‌తో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నివారణ కోసం అనుమానాస్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి రహిత జిల్లాగా రూపొందించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల గురించి ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 లేదా తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం తెలియజేయాలని సూచించారు.

బంగారం కోసమే మహిళ హత్య

- నిందితురాలి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్‌రూరల్: మహిళను హత్యచేసి బంగారు ఆభరణాలు దొంగిలించిన నిందితురాలిని అరెస్టు చేసినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. శనివారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లోగల ఏసీపీ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన గడియారం బాలమణి(62)కి ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. కుమారులకు వివాహం కావడంతో బాలమణి ఒక్కతే నివసిస్తుంది. ఈమెకు పట్టణంలోని సంగాపూర్ మార్గంలో ఉండే రజియా అలియాస్ హసీనాతో ఓ కల్లు దుకాణంలో పరిచయం ఏర్పడింది. రజియా తనకు డబ్బులు అవసరమైనప్పుడు బాలమణి వద్ద తీసుకునేది. పలుమార్లు బాలమణి ఇంటి వద్ద ఇద్దరూ కలిసి కల్లు తాగారు. ఈ క్రమంలో బాలమణి వద్ద చెవి కమ్మలు, వెండి కాళ్ల కడియాలు, డబ్బులు ఉండడాన్ని గుర్తించిన రజియా ఆమెను చంపి వాటిని ఎత్తుకెళ్లాలని నిర్ణయించుకుంది. 8వ తేదీన రజియా బాలమణి ఇంటికెళ్లి ఆమెకు మాయమాటలు చెబుతూ మెడలో ఉన్న పసుపుదారంతో వెనుక నుంచి గట్టిగా బిగించి చంపేసింది. అనంతరం బంగారు చెవి పోగులు, వెండి కాళ్ల కడియాలు ఎత్తుకెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సమీపంలోని సీసీ కెమరాలు, సాంకేతిక టెక్నాలజీని వినియోగించి రజియాను అదుపులోకి తీసుకొని దొంగిలించిన ఆభరణాలను స్వాధీనం చేసుకొని జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు.

బాలుడి ప్రాణం తీసిన అతివేగం

రోడ్డుపై తాతతో కలిసి నడుచుకుంటూ వెళ్తుండగా ఢీకొట్టిన కారు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని చాట్లపల్లిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిలుముల కృష్ణ–మమత దంపతుల కుమారుడు హర్షవర్ధన్(5) తాతతో కలిసి రోడ్డుపైకి వచ్చాడు. ఈ క్రమంలో జగదేవ్‌పూర్ నుంచి వేగంగా వచ్చిన కారు బాలుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోగా గ్రామస్తులు సుమారు 10 కిలోమీటర్ల మేర వెంబడించి నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

శుభకార్యానికి వచ్చి వాగులో పడి



మహేశ్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): వాగులో పడి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అల్వాల శివారులోని కూడవెల్లి వాగులో శనివారం జరిగింది. మిరుదొడ్డి పోలీసుల కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన చామంతి మహేశ్(30) మండల పరిధిలోని అల్వాలకు చెందిన బంధువు బాబూరావు ఇంట్లో శుభకార్యానికి శుక్రవారం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసొచ్చాడు. అదే రోజు బైక్‌పై బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు ఎంత వెతికినా ఫలితం లేకుండా పోయింది. శనివారం అల్వాల శివారులోని కూడవెల్లి వాగులో మహేశ్ మృతదేహమై తేలుతూ కనిపించాడు. మద్యం సేవించి వాగులో స్నానం చేయడానికి వెళ్లి నీట మునిగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు నిర్ధారించారు. మృతుడి భార్య కనకలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓపెన్ జిమ్.. కొందరికే పరిమితం

- మున్సిపాలిటీ శివారులో ఏర్పాటు
- పక్కనే చెరువు, ప్రమాదకరంగా కాల్వ
- 19 వేల జనాభాకు ఒక్కటే జిమ్
- వినియోగించుకోలేకపోతున్న మహిళలు, చిన్నారులు
- మరికొన్ని చోట్ల ఏర్పాటు చేయాలని వినతి



పెద్ద చెరువు కట్టపై ఓపెన్ జిమ్



ఓపెన్ జిమ్ పక్కన ప్రమాదకరంగా అలుగు నీరు కాల్వ

చేర్యాల(సిద్దిపేట): పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం పట్టణ శివారులోని పెద్ద చెరువుకట్టపై గత పాలకవర్గం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసింది. పట్టణానికి దూరంగా చెరువుకట్టపై ఉండటంతో అది కొంత మందికి మాత్రమే పరిమితమవుతోంది. పట్టణ పరిధిలో 12 వార్డులు ఉండగా, 19 వేల జనాభా ఉంది. కానీ పట్టణంలో ఒకే ఒక్క ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. అది చెరువు కట్టపై ఏర్పాటు చేయడంతో మహిళలు, చిన్న పిల్లలు రావడానికి జంకుతున్నారు. కట్ట మీద వాకింగ్ చేసే వారికి సరిపోక వ్యాయామం చేయలేకపోతున్నామని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిమ్ పక్కనే చెరువు, కాల్వ

పట్టణ శివారులోని చెరువు కట్టపై ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో కేవలం కొంత మంది మాత్రమే వినియోగించుకుంటున్నారు. జిమ్‌కు ఒక పక్క చెరువు, మరో పక్క చెరువు అలుగునీరు వెళ్లేందుకు తీసిన కాల్వ, కట్ట ప్రారంభంలో మార్చురీ ఉన్నాయి. దీంతో మహిళలు, చిన్నారులు ఓపెన్ జిమ్‌కు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని కుడి చెరువు, పెద్దమ్మగడ్డ, శ్రీనగర్ కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా వంటి ముఖ్య కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తే పట్టణ ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణ పరిధిలో మరికొన్ని ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరిన్ని ఏర్పాటు చేయాలి



పట్టణ శివారులోని చెరువు కట్ట మీద కాకుండా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే యువతీ, యువకులు, మహిళలు, చిన్నారులు, వాకర్స్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కట్ట మీద ఏర్పాటు చేసిన జిమ్‌కు పట్టణ ప్రజలు అందరూ రాలేకపోవడంతో కొంత మందికే ఉపయోగంగా ఉంది. కావున మరికొన్ని ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి.

– నాగరాజు, వాకర్

ప్రభుత్వ స్థలం లేదు



పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో మరికొన్ని జిమ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. ప్రభుత్వానికి పంపించడానికి పట్టణ పరిధిలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో చేయలేకపోతున్నాం త్వరలోనే స్థలాన్ని అన్వేషించి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– జీ.నాగేందర్, మున్సిపల్ కమిషనర్

వైభవంగా శనిత్రయోదశి మహోత్సవం



సామూహిక శనీశ్వర పూజలో భక్తజనులు



శనీశ్వరుడికి తైలాభిషేకం చేస్తున్న అర్చకులు

భక్తజన సామూహిక తైలాభిషేకం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ శనీశ్వర క్షేత్రం శనిత్రయోదశి మహోత్సవంతో అలరారింది. భక్తజన సామూహిక తైలాభిషేకాలతో శనీశ్వరుని సన్నిదానం కిటకిటలాడింది. శనివారం ఉదయం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో వేడుకలకు అంకురార్పణ జరిగింది. ఆలయ మహామండపంలో భక్తులు బారులుతీరి కూర్చుని భక్తి శ్రద్ధలతో శనీశ్వర పూజ నిర్వహించారు. అనంతరం శని భగవానుడి మూల విగ్రహానికి తిల, తైలం సమర్పించారు. దోషాలు తొలగించి శుభాలు చేకూర్చాలని ప్రార్థించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. శనీశ్వర పూజ అనంతరం సరస్వతీ అమ్మవారిని, ఉప ఆలయాల్లో దేవతామూర్తులను దర్శించుకొని మహా ప్రసాదం స్వీకరించారు. క్షేత్రాన్ని గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి స్వాతి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ వేద పండితులు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రం అందజేశారు. క్షేత్రంలో 1,000 వరకు సామూహిక తైలాభిషేకాలు జరిగినట్లు ఆలయ మేనేజర్ రఘుపవన్ పేర్కొన్నారు.